క్లుప్తంగా

బస్సు ఢీకొని ఒకరి మృతి

తిరుపతి క్రైమ్ : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిస్సాకు చెందిన మొహిద్దిన్(33) రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్ వద్ద ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మొహిద్దిన్ ను స్థానికుల సహాయంతో హుటాహుటిన రుయా హాస్పిటల్ తరలించారు. కాగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

కిందపడి విద్యార్థి మృతి


మృతి చెందిన సాల్మన్

చంద్రగిరి : ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలైన విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మండల పరిధిలోని రాయలపురం పంచాయతీకి చెందిన బాలకృష్ణ, అనురాధ దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. చివరి కుమారుడు సాల్మన్(13) 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటూ సాల్మన్ ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో బాలుడికి మూర్ఛ రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సాల్మన్ మృత్యువాత పడ్డాడు. కళ్లెదుట ఆడుకుంటున్న కన్నబిడ్డ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 20 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 20 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు తిరుపతి నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు పేర్కొన్నారు.

చార్జీల బాదుడు

- టోల్ గేట్ పేరుతో బస్సుల్లో అదనపు వసూలు
- తిరుపతి–శ్రీకాళహస్తి బస్సు చార్జీల పెంపు
- టిక్కెట్‌పై రూ.10 పెంపు
- ప్రయాణికులపై అదనపు భారం


శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి మేర్లపాక టోల్‌గేట్ వద్ద వస్తున్న మెట్రో సర్వీస్

తిరుపతి అర్బన్ : జిల్లాలో తిరుమల తర్వాత ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన శ్రీకాళహస్తి దేవస్థానానికి నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. తిరుపతికి వచ్చే భక్తులు తిరుమల, తిరుచానూరు దర్శనం అనంతరం శ్రీకాళహస్తికి వెళుతుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే సర్వీసుల్లో చార్జీలు పెద్ద ఎత్తున పెంచేశారు. దీంతో పలువురు ప్రయాణికులు మండిపడుతున్నారు.

తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని ఏర్పేడు సమీపం మేర్లపాక వద్ద ఇటీవల టోల్‌గేట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఈ మార్గంలో నడుస్తున్న ఆర్టీసీ చార్జీలను టిక్కెట్ ధరపై ఏకంగా రూ.10 పెంచేశారు. దీంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ఆర్టీసీ టోల్‌గేట్ చెల్లించే దాని కంటే రెట్టింపు ధరలు చార్జీల ద్వారా గుంజేస్తున్నారని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

ఆర్టీసీ టోల్‌గేట్‌లో రూ. 705 చెల్లించాల్సి ఉంది.

తిరుపతి నుంచి ఓ ఆర్టీసీ సర్వీసు శ్రీకాళహస్తికి వెళ్లడానికి రూ.470, తిరిగి రావడానికి రూ.235 చెల్లించాలి. మొత్తంగా రూ.705 టోల్‌గేట్‌లో ఒక ఆర్టీసీ సర్వీస్ చెల్లించాల్సి ఉంది. అయితే ఆర్టీసీ సర్వీసులో 46 సీట్లు ఉన్నాయి. ఒక టిక్కెట్‌పై రూ.10 పెంచారు. దీంతో ఒక ట్రిప్పునకు రూ.460 ఆర్టీసీకి వస్తుంది. మరో ట్రిప్పునకు రూ.460 వస్తుంది. మొత్తంగా రెండు ట్రిప్పులకు రూ.920 వస్తుంది. అయితే రెండు ట్రిప్పులకు ఆర్టీసీ టోల్‌గేట్‌లో చెల్లించేది రూ.705 మాత్రమే. ఈ క్రమంలో ఆర్టీసీకి అదనంగా రూ. 215 మిగులుతుంది. టోల్‌గేట్ ఏర్పాటు చేస్తే ఆ చార్జీలను ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. అలా కాకుండా కూటమి సర్కార్‌లో ప్రయాణికులపై అదనపు భారాన్ని చార్జీలు పెంచి వసూళ్లు చేయడంపై పలువురు మండిపడుతున్నారు.

శ్రీకాళహస్తి డిపో నుంచి 8 మెట్రో సర్వీసులు విశాఖకు తరలింపు

తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండడం కోసం గాలి, వెలుతురు వచ్చేలా ఉండే మెట్రో సర్వీస్‌లను గతంలో 32 ఏర్పాటు చేశారు. అయితే వాటిలో 8 సర్వీసులు మరమ్మతుకు గురికావడంతో 24 సర్వీసులు తిరుగుతుండేవి. వాటిలో తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి చార్జీ రూ.55 మాత్రమే. అయితే మూడు నెలల కిందట మెట్రో సర్వీస్‌లు విశాఖపట్నంలో టౌన్ సర్వీస్‌లకు అనుకూలంగా ఉంటాయని శ్రీకాళహస్తి డిపో నుంచి విశాఖపట్నానికి పంపించారు. వాటి స్థానంలో 8 అల్ట్రా డీలక్స్ సర్వీస్‌లను ఏర్పాటు చేశారు. మెట్రో సర్వీస్‌లో టిక్కెట్ ధర రూ.55 ఉంటే...అల్ట్రా డీలక్స్‌లో టిక్కెట్ ధర రూ.70 చేశారు. దీంతో ప్రయాణికులు తమకు మెట్రో సర్వీసులు ఎంతో అనుకూలంగా ఉండేవని....వాటి స్థానంలో అల్ట్రా డీలక్స్‌లను ఏర్పాటు చేసి...టిక్కెట్‌పై రూ.15 పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా ఆర్టీసీ వాటిని పట్టించుకోకుండా చార్జీలను అలానే కొనసాగిస్తోంది. తాజాగా అల్ట్రాడీలక్స్‌లో టోల్‌గేట్ పేరుతో రూ.5 పెంచారు. మొత్తంగా తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి అల్ట్రా డీలక్స్‌లో వెళ్లాలంటే టిక్కెట్ ధర రూ.75 చెల్లించాల్సి ఉంటుంది.

టోల్‌గేట్‌లో తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో పెంచిన చార్జీలు

సర్వీస్	పాత చార్జీలు	కొత్తగా చార్జీలు (రూ.లలో)
మెట్రోసర్వీస్	55	65
ఎక్స్‌ప్రెస్	55	65
పల్లెవెలుగు	45	55
ఆర్డినరీ సర్వీస్‌లు	45	55
అల్ట్రాడీలక్స్	70	75

నష్టం వస్తుందని..



తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలో తిరుగుతున్న సర్వీస్‌ల్లో టిక్కెట్ ధరపై రూ.10 పెంచాం. అయితే అల్ట్రా డీలక్స్ మాత్రం టిక్కెట్ ధరపై రూ. 5 పెంచాం. ఒక సర్వీస్ శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్లి రావడానికి రూ.705 టోల్‌గేట్ కట్టాల్సి ఉంది. ఒక సర్వీస్‌లో 45 లేదా 46 సీట్లు ఉంటే రెండు ట్రిప్పులకు టిక్కెట్ ధర పెంచడం ద్వారా రూ.900 నుంచి 920 వస్తుంది. అయితే అన్ని సీట్లు...అన్ని ట్రిప్పులు భర్తీ కావడం లేదు. ఈ క్రమంలోనే టిక్కెట్ ధర రూ.10 చేయాల్సి వచ్చింది. టిక్కెట్‌పై రూ.10 పెంచకపోతే ఆర్టీసీకి నష్టం వస్తుంది.

– మునిచంద్ర, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్

తల్లీ.. కూటమికి కనువిప్పు కలిగించు!

- రాహుకాల పూజల్లో చెవిరెడ్డి లక్ష్మి


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మి

తిరుపతి రూరల్ : 'అమ్మా.. చాముండేశ్వరీ.. కుట్రలు, కుతంత్రాలు, కక్షలతో కళ్లు మూసుకుని పరిపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు తల్లీ.. నీ బిడ్డ చెవిరెడ్డిని రాజకీయ కక్షతో అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారు.. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు మనోధైర్యం కలిగించు.. తల్లీ..' అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అమ్మవారిని వేడుకున్నారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలోని శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే రాహుకాల పూజల్లో చెవిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు. ఆమె చేత అమ్మవారికి శాంతి పూజలు, హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో తుమ్మలగుంటకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యువతకు వెన్నుపోటు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నగర అధ్యక్షుడు దినేష్ రాయల్ తదితరులు

- ఎన్నికల్లో యువతకు కూటమి ఇచ్చిన హామీలు గాలికి
- 23న కలెక్టర్ కార్యాలయం వద్ద హామీల అమలుకు 'యువత పోరు'

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువత భవిష్యత్తు అంధకారంగా మారిందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఈనెల 23న పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనలో యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చిన పాపానపోలేదని మండిపడ్డారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి యువతను మోసగించి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షల ఉద్యోగాలు ఇస్తామని, రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ యువతకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు వైఎస్సార్‌సీపీ యువత పోరు చేపడుతోందన్నారు. యువత పోరు కార్యక్రమంలో భారీగా యువత పాల్గొని కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లం రవికుమార్‌రెడ్డి, రూపేష్, రమణ, సుధార్, పసుపులేటి సురేష్, చరణ్, జాఘవా, పవన్, ఓబుల్‌రెడ్డి, చంగల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, యశ్వంత్, వినోద్ తిరుమలరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

కడుపు మండి.. రోడ్డుపై పోసి


మామిడి కాయలను పారబోసిన రైతులు

పాకాల : రోజురోజుకి మామిడి రైతులు కన్నీటి వ్యథ అధికమవుతోంది. మామిడికి గిట్టుబాటు ధర హామీ నెరవేరక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నీటిపై రాసిన రాతలుగా మారడంతో రైతులు విస్తుపోతున్నారు. కేవలం రూ.3లకు కొనుగోలు చేస్తూ ర్యాంపు నిర్వాహకులు, సప్లయర్లు రైతులను దగా చేస్తున్నారు. శుక్రవారం కొన్ని ర్యాంపులను తెరిపించి రైతుల వద్ద మామిడిని కొనుగోలు చేయడానికి టోకెన్లను ఇప్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్, ఆర్డీఓ రామ్మోహన్, డీహెచ్‌ఓ దశరథరామిరెడ్డి, సీఐ సుదర్శన్‌ప్రసాద్, ఉద్యానశాఖ అధికారిణి శైలజ పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం


నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన 2వ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అర్హత సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.హృతిక్ రాయల్, సలాడీ భువనేష్, ఎం.నిహాంత్ కుమార్, డి.మహిదర్‌తో పాటు మొత్తం 54 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించారని తెలిపారు. గత 35 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ తదితర పోటీ పరీక్షలకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. దీంతో తమ విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశం సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు. వచ్చే ఏడాదికి నిర్వహించే పోటీ పరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడి అరెస్టు

- ఉపాధి పనుల్లో అవినీతిని ప్రశ్నించినందుకా..?
- అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం


భాకరాపేట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజకవర్గంలో గత ఏడాది కాలంగా ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల్లో అవినీతిని సమాచార హక్కు చట్టం ద్వారా బయటకు తీసి అధికారులకు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన వైఎస్ఆర్‌సీపీ సానుభూతిపరుడిపై కక్ష పెట్టుకున్న స్థానిక టీడీపీ నేతలు పోలీసుల ద్వారా శుక్రవారం అరెస్టు చేయించారు. బాధితుని కుటుంబీకుల సమాచారం మేరకు.. ఎర్రావారిపాళెంకు చెందిన అరవింద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతను వైఎస్ఆర్‌సీపీకి సానుభూతి పరుడు. తన గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిని ఢిల్లీ స్థాయికి చేర్చడంతో స్థానిక నేతలు అతనిపై కక్షకట్టారు. రెండు రోజుల క్రితం కుప్పంలో అప్పు కట్టనందుకు ఓ మహిళను చెట్టు కట్టేసిన వార్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అదే పోస్టును అరవింద్ కూడా తన వాట్సాప్ గ్రూపులో షేర్ చేశాడు. దీనిపై అదే మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఫిర్యాదు చేయగా పోలీసులు అతనిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఆ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు భాకరాపేట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని సీఐని ప్రశ్నించగా సీఎంను కించపరిచేలా పోస్టు పెట్టినందుకు కేసు నమోదు చేస్తున్నామని వివరించారు. అయితే 41సి నోటీసు ఇవ్వాల్సిన కేసులో నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఎలా నమోదు చేస్తారని న్యాయవాది ప్రశ్నించడంతో పోలీసులు నుంచి ఏలాంటి సమాధానం రాలేదు. దీంతో ఎర్రావారిపాళెం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెంగల్‌రెడ్డి, నన్ని, హరినాథరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెంగల్ రెడ్డి, చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు సింహాల మోహన్, హరినాథ్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల తీరును తప్పుబట్టారు. బెయిలబుల్ సెక్షన్లు పెట్టాల్సిన కేసులో నాన్ బెయిలబుల్ కేసు పెట్టి చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డ పోలీసులపై కోర్టులో కేసు వేస్తామని వైఎస్ఆర్‌సీపీ నేతలు, అతని కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

ప్రతిశాఖలోనూ మహిళా కమిటీలు

తిరుపతి అర్బన్ : ప్రతి శాఖలోనూ అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యులు అర్చన మంజుదార్ ఆదేశించారు. రెండో రోజు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న నేరాలను నిరోధించాలంటే ప్రభుత్వ ప్రైవేటు సెక్టార్లకు సంబంధించిన యాక్ట్‌ను పటిష్టం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ మహిళా కమిషన్ సూచనలు క్రమం తప్పకుండా పాటించి లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో మహిళలపై నేరాలను అరికట్టే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. మహిళల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. మహిళా కమిషన్ మెంబర్ రోఖాయా బేగం, డీఎస్పీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

తిరుపతి తుడా : తిరుపతి నియోజకవర్గ పరిధిలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి అందించిన ఫారమ్ 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీలు సైతం బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

వకుళమాత ఆలయ తృతీయ వార్షికోత్సవం


కిరీటం బహూకరిస్తున్న దాతలు

తిరుపతి రూరల్ : తిరుపతి సమీపంలోని పేరూరు బండపై వెలసిన వకుళమాత ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వెండి కిరీటం బహూకరణ

హైదరాబాద్‌కు చెందిన ఆర్.అమరనాథ్, శైలజ దంపతులు అమ్మవారికి రూ. 4.50 లక్షల విలువైన బంగారు పూత పూసిన వెండి కిరీటం బహూకరించారు.

సర్టిఫికెట్‌లకే తొలి ప్రాధాన్యం

తిరుపతి అర్బన్ : విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో సర్టిఫికెట్‌ల జారీకే తొలి ప్రాధాన్యమివ్వనున్నట్లు తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు.

అంకిత భావంతో పనిచేద్దాం : కలెక్టర్

తిరుపతి అర్బన్ : రెవెన్యూ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, రాష్ట్ర సెక్రటరీ అశోక్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వన్ ఫైల్, వన్ లైఫ్ అనే నినాదంతో రెవెన్యూ శాఖ పనిచేయాలని పేర్కొన్నారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ.. రెవెన్యూకు సంబంధించిన సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని కోరారు. డీఆర్‌ఓ నరసింహులు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్, శివశంకర్ నాయక్,ల్యాండ్ అండ్ సర్వే శాఖ అధికారి అరుణ్ కుమార్, సిపిఓ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీఆర్‌ఓ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి కోసం పోరాటం


ఆందోళన నిర్వహిస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు

రామచంద్రాపురం : మండలంలోని పీవీపురంలో ప్రభుత్వ పాఠశాలను మరో బడిలో విలీనం చేస్తుండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 40 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను 20 మంది మాత్రమే ఉన్న బలిజపల్లె మోడల్ బడిలో కలపడం దారుణమన్నారు. నేతలు అక్బర్, అశోక్, వినోద్, శివ, రామదాసు రెడ్డి, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

పుత్తూరు సిద్ధార్థలో గ్రాడ్యుయేషన్ డే


మెడల్ అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం: పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, ఓల్వా గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాస్ అవుట్ విద్యార్థులకు మెడల్స్, పట్టాలు అందజేశారు. అనంతరం కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ సృజనాత్మక, ఇన్నోవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 17 మంది విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అరాచకంగా అక్రమ కేసులు


మాట్లాడుతున్న ఓబుల్‌రెడ్డి

తిరుపతి సిటీ : వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం అరాచకంగా అక్రమ కేసులు బనాయించి అరెస్టులకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సర్కార్ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసిందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసుకుని కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారని తెలిపారు. పేదల పక్షపాతిగా, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తు చెవిరెడ్డిని అక్రమ కేసులతో వేధించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల్లో వ్యతిరేకత తీవ్రస్థాయికి చేరిందని స్పష్టం చేశారు. అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వెల్లడించారు. సమావేశంలో పార్టీ చంద్రగిరి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు వినోద్‌కుమార్, స్థానిక నేత ఎం.ముబారక్ పాల్గొన్నారు.

విషాద యాత్ర

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి


ప్రమాదంలో ధ్వంసమైన కారు


మస్తాన్ సాహెబ్, ఆయేషా మృతదేహాలు

కొడవలూరు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఓ బాలిక, ఓ వృద్ధుడు మృతిచెందారు. ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేటకు చెందిన మహబూబ్‌బాషా కుటుంబంలో పదిమంది కారులో హైదరాబాద్ యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా, కొడవలూరు మండలం రాచర్లపాడు సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మస్తాన్ సాహెబ్ (67) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయేషా (11) అనే బాలిక తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయింది. కారు నడుపుతున్న మహబూబ్‌బాషాతోపాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మొబైల్ సిబ్బంది చొరవతో 108లో చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్ఐ కోటిరెడ్డి వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

తిరుపతి క్రైమ్ : ఆటోనగర్‌లోని ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు.. ఆటోనగర్‌లోని కృష్ణారెడ్డి నగర్ లో కెనరా బ్యాంక్ ఏటీఎంను గురువారం రాత్రి ఓ దుండగుడు పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. శుక్రవారం ఉదయం ఈ విషయం గమనించిన బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఏటీఎంలో నగదు సురక్షితంగా ఉందని వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ఆదేశం


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : రామాపురం డంపింగ్ యార్డ్‌లో వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం రామాపురం డంపింగ్ యార్డును పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డులోని చెత్త నిర్వహణ అక్టోబర్ 2వ తేదీలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం యంత్రాలు, కార్మికులను పెంచాలని సూచించారు. ఈ మేరకు చెత్త నిర్వహణను ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీఈ రమణ, జిగ్నా సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఆక్రమణపై ఆవేదన


మాట్లాడుతున్న బాధితుడు ఏలుమలై

తిరుపతి కల్చరల్ : పిచ్చాటూరు మండలం రామగిరిలోని సర్వే నంబర్ 176/2లో ఉన్న 80 సెంట్ల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు ఎం.ఏలుమలై కోరారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తమ స్వీయార్జితమైన భూమిని కబ్జాదారులు కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించి 2011లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేయించి, తన భూమిని తిరిగి ఇప్పించాలని విన్నవించారు.

సమస్యల పరిష్కారంలో కీలకం


మాట్లాడుతున్న రెవెన్యూ సిబ్బంది


చంద్రగిరి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరామసుబ్బయ్య కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ కీలకమన్నారు. సకాలంలో ధ్రువీకరణ పత్రాల మంజూరు, భూ సమస్యల పరిష్కారం, అక్రమ ఇసుక, మట్టి రవాణాపై చర్యలు తీసుకోవడంలో సిబ్బంది ఉత్తమ పనితీరు చూపాలని కోరారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనపైనే ఉందని గుర్తించాలని సూచించారు. అనంతరం పలువురికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

వేతన బకాయిల చెల్లింపునకు డిమాండ్


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి తుడా : రుయా హాస్పిటల్, మెడికల్ కాలేజ్, మెటర్నిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 3 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ మేరకు ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు సదరు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించకుండా మూడు నెలలుగా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లగా పీఎఫ్ నగదును కూడా కార్మికుల ఖాతాలో జమ చేయకుండా, నిధులను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీఓ జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నేతలు ఎన్‌డీ రవి, మహేంద్ర, రైల్వే బాల, రూపా, దేవి, ఈశ్వరి పాల్గొన్నారు.

గుజిరీలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్ : గుజిరీ వ్యాపారులకు అండగా ఉంటామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. శుక్రవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో గుజిరీ వ్యాపారుల జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గుజిరి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు, మున్సిపల్ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. నేతలు అల్లా బక్షు, దాము, శ్రీరాములు, రాము, అజీమ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్, బాల, మహేంద్ర, చారులత, నాగరాజు పాల్గొన్నారు.



పునర్నిర్మాణమే లక్ష్యం

తిరుచానూరు సమీపంలోని దామినేడు గ్రామ దేవత నాగాలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల టీడీపీ నేత కృష్ణమూర్తి నాయుడు దుర్మార్గంగా ఆలయం కూల్చివేసిన నేపథ్యంలో పునర్నిర్మాణమే లక్ష్యంగా స్థానికులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. త్వరలోనే నాగాలమ్మకు వైభవంగా ఉత్సవాలు జరిపించనున్నట్లు వెల్లడించారు.

– చంద్రగిరి

పరిశుద్ధ జలం



చంద్రగిరి మండలం అగరాల పంచాయతీలో వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.3.30లక్షలు మంజూరు చేసి ఈ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించి ప్రజలకు పరిశుద్ధ నీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిపై గ్రామస్తులు చెవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి, ఉప సర్పంచ్ సుశీల, వైఎస్సార్‌సీపీ నేతలు పటాన్ రహీమ్, అక్బర్, అనీల్, సోమశేఖర్, పురుషోత్తంరెడ్డి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

– చంద్రగిరి

అద్దె తగ్గింపులో ఆంతర్యం?


ఎస్వీయూ ఎంబీఏ, ఎంసీఏ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన జియో టవర్లు


ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట జియో సంస్థ ఏర్పాటు చేసిన టవర్

వ్యాపార దిగ్గజం రిలయన్స్‌పై ఎస్వీయూ అధికారులు ప్రేమాభిమానాలు ప్రదర్శిస్తున్నారు. చిరుద్యోగుల వేతన వెతలను పట్టించుకోరు.. కానీ, జియో సంస్థపై ఉదారంగా వ్యవహరిస్తున్నారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన టవర్లకు చెల్లించాల్సిన అద్దెను సగానికి సగం తగ్గించేశారు. రూ.లక్షల కొద్దీ బకాయిలను వసూలు చేయకపోగా.. లైసెన్స్‌ను మాత్రం పునరుద్ధరించేశారు. సిబ్బందికి ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు చేపట్టరు.. కానీ, అంబానీల సామ్రాజ్యానికి వంగి వంగి సలామ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం అభివృద్ధిని నిస్సంకోచంగా గాలికి వదిలేశారు. ప్రతి నెలా వచ్చే ఆదాయానికి నిర్మొహమాటంగా గండి కొట్టేందుకు తెగబడుతున్నారు. ఈ మేరకు వర్సిటీ అధికారుల తీరుపై ఉద్యోగులు.. విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

- జియో సంస్థపై ఎస్వీయూ అధికారుల అభిమానం
- రూ.71లక్షల బకాయిలను పట్టించుకోని వైనం
- సగానికి సగం బాడుగ తగ్గింపుపై సర్వత్రా విస్మయం
- వర్సిటీకి ఆదాయానికి గండి పడినా స్పందించని యంత్రాంగం

తిరుపతి సిటీ : రిలయన్స్ జియో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ఎస్వీయూ అధికారులు ఎక్కడ లేని జాలి చూపుతున్నారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన జియో టవర్స్‌కు సంబంధించి నెలసరి అద్దెను 50 శాతం తగ్గించారు. 2017లో ప్రత్యేక కమిటీ సిఫార్సుల మేరకు జియోకు చెందిన మూడు టవర్స్‌ను ఎస్వీయూలో ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒక్కో టవర్‌కు జీఎస్‌టీ కాకుండా రూ.50వే లు అద్దె చెల్లించే విధంగా అప్పటి వీసీ ఆధ్వర్యంలో కమిటీ నిర్ణయం తీసుకుంది.

రూ.28వేలకు తగ్గింపు

సమిట్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (గతంలో రిలయన్స్ జియో లిమిటెడ్) సంస్థ తమ వ్యాపార విస్తరణలో భాగంగా వర్సిటీలో టవర్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు 2017లో ఎస్వీయూతో ఎంఓయూ కుదుర్చుకుంది. అందులో భాగంగా వర్సిటీ ఆవరణలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాల సమీపంలో రెండు ప్రధాన గ్రౌండ్ బేస్ట్ జియో టవర్లను, ఇంజినీరింగ్ కళాశాల ఎదుట మరో టవర్‌ను ఏర్పాటు చేసింది. నెలకు రూ.50వేల అద్దె చెల్లించే విధంగా కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. అలాగే ప్రతి ఏడాది 5శాతం అద్దె పెంచుకునే వెసులుబాటు ఉంటుందని ఒప్పందంలో పేర్కొంది. అయితే ఇటీవల వర్సిటీ అధికారులను కలసిన ఆ సంస్థ ప్రతినిధులు అద్దె తగ్గించాలని విన్నవించినట్లు తెలిసింది. దీంతో వెనకాముందు చూడకుండా కమిటీ సిఫార్సు చేసిందంటూ అధికారులు ఒక్కో టవర్‌కు నెలకు రూ.28వేలు చెల్లిస్తే చాలని ఆదేశాలు జారీ చేసేశారు.

లక్షల బకాయిలు ఉన్నా....

ఎస్వీయూలో గత రెండు ఏళ్ల నుంచి జియో సంస్థ మూడు టవర్స్‌కు అద్దె చెల్లించకుండా దాటవేసింది. దీంతో మొత్తం రూ.71లక్షలు బకాయి పడింది. దీనిపై పలు మార్లు అధికారులు నోటీసులు పంపినా సాకులు చెబుతూ కాలం వెళ్లదీసింది. ఈ క్రమంలో బకాయిలు 2023వరకు రూ.14.36లక్షలు, 2024వరకు రూ.18.90లక్షలు, 2025 మే చివరినాటికి రూ. 23.31లక్షలుపైబడి ఉన్నాయి. అలాంటిది వర్సిటీకి రావలసిన బకాయిలపై దృష్టి సారించకుండా ప్రస్తుతం ఉన్న అద్దెను తగ్గించి మరో 10ఏళ్లు 2032వరకు లైసెన్స్‌ను పొడిగించేశారు. వర్సిటీ ఆదాయానికి గండికొట్టాలని ఎవరు పుణ్యం కట్టుకున్నారో తెలియదుగానీ బకాయిలు ఉన్నా లైసెన్స్‌ను పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ఉపసంహరించుకోవాలి

ఎస్వీయూలో జీతాలు ఒకటో తారీఖున అందకుండా ఎంతో మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొంత మంది ఉద్యోగులకు చెల్లించే జీతాలు కుటుంబ పోషణకు సరిపోకపోగా అప్పు చేసి జీవనం సాగిస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే రూ.లక్షల కోట్లకు పడగలెత్తిన జియో వంటి సంస్థలకు వర్సిటీ అధికారులు అద్దెను తగ్గించడం ఆశ్చర్యమేస్తోంది. వర్సిటీ ఆదాయానికి నష్టం వాటిల్లే నిర్ణయాలు తీసుకోవడం దారుణం. వెంటనే అధికారులు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

- వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు

నిర్ణయం తీసుకోలేదు

ఎస్వీయూలో జియో సంస్థ ఏర్పాటు చేసిన మూడు టవర్లకు సంబంధించి గతంలో అద్దె పెంచారని ఆ సంస్థ ప్రతినిధులు విన్నవించారు. దీనిపై సుదీర్ఘంగా పరిశీలించి నివేదిక సమర్పించేందుకు ప్రత్యేక కమిటీని నియమించాం.అద్దెను ఇప్పటివరకు నిర్ణయించలేదు. కమిటీ నివేదిక ప్రకారం అద్దె ఉంటుంది. బకాయిలు చెల్లించాలని ఆ సంస్థను ఆదేశించాం.

- సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి తిరుమాడ వీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- టీటీడీ పరిపాలన భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 6.30 గంటలకు యోగాసన కార్యక్రమం.
- ఇస్కాన్ రోడ్డులోని ఓం శాంతి మ్యూజియంలో ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం అభ్యాసన.
- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎస్వీయూ తారకరామ స్టేడియంలో ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు యోగాసనాలు.
- సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు న్యూ మారుతీనగర్, రాయల్ నగర్, అవిలాల, కలశం బిల్డింగ్, ఈఎస్ఐ ఆస్పత్రి, ధనలక్ష్మినగర్ మునిరెడ్డినగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం.
- కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్ ద్వారా విడుదల, మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లకు సంబంధించిన టికెట్లు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల.
- యూత్ హాస్టల్‌లో సాయంత్రం 5 గంటలకు టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లు, సమస్యలపై సమావేశం.
- టీటీడీ ఆన్‌లైన్ ద్వారా ఉదయం 10 గంటలకు మొబైల్ ఫోన్ల ఈ–వేలం.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు శ్రీవారి మెట్టు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు టోకెన్ల పంపిణీ.

'రాస్'లో శ్రీలంక బృందం

తిరుపతి కల్చరల్: శ్రీలంకకు చెందిన 43 మంది ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయుల బృందం రాస్ ఆధ్వర్యంలో పిల్లల కోసం చేపట్టిన పలు కార్యక్రమాలను పరిశీలించింది. శుక్రవారం ఈ మేరకు చెన్నారెడ్డి కాలనీ ఎంజీఎం పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించింది. బోధన విధానం, అభ్యసన సామగ్రి, పాఠ్య ప్రణాళికలను ఆరా తీసింది. మహిళా వర్సిటీలో విద్యాబోధనను అడిగి తెలుసుకుంది. ఐసీడీఎస్ కింద గర్భిణుల, బాలింతలు, చిన్నారులకు అందించే డైట్ ప్లాన్‌ను అధ్యయనం చేసింది. ఐఐటీ క్యాంపస్‌లో ప్రీ ప్రైమరీ పాఠశాల, కేంద్రీయ విద్యాలయంలో అభ్యసన పద్ధతులు తెలుసుకుంది. పల్లం గ్రామంలో ఉన్నత పాఠశాల, కరకంబాడిలోని రాస్ బాలాజీ బాలవికాస్‌ను సందర్శించింది. విభిన్న ప్రతిభావంతుల పాఠశాల, వృద్ధాశ్రమాలు, నర్సింగ్ స్కూల్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం నుంచి అభినందనలు అందుకుంది.


రాస్ కార్యాలయం ఎదుట శ్రీలంక ఉపాధ్యాయులు

వకుళామాత సేవలో పెద్దిరెడ్డి

తిరుపతి రూరల్ : పేరూరు బండపై వెలసిన వకుళామాతను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించారు. పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.


ఆలయం వెలుపల మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

ఆరు గంటలకే.. కార్యక్రమం ఎలా..?

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టేడియంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ కోసం అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుందని, తప్పనిసరిగా రావాలని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హుకుం జారీ చేయడం దారుణమని పేర్కొంటున్నారు. పిల్లలు ఉదయం 6 గంటలకే ఎస్వీయూ స్టేడియానికి చేరుకోవాలంటే కష్టమనే కనీస జ్ఞానం లేకుండా కార్యక్రమ సమయం నిర్ణయించారని మండిపడుతున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఇవ్వకుండా మళ్లీ హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7.30 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించి ఉంటే అందరికీ అనుకూలంగా ఉండేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

సంఘమిత్రకు అండగా సభ్యులు


విచారణకు హాజరైన డ్వాక్రా మహిళలు

తిరుపతి రూరల్ : మండలంలోని కేసీపేటకు చెందిన సంఘమిత్ర ధనలక్ష్మికి డ్వాక్రా గ్రూపుల సభ్యులు అండగా నిలిచారు. ధనలక్ష్మి అవకతవకలకు పాల్పడినట్లు కొందరు టీడీపీ నేతలు ఆరోపించడంతో శుక్రవారం వెలుగు మండలస్థాయి సంఘాల సమాఖ్య సుజాత విచారణ చేపట్టారు. రాజకీయ కుట్రలో భాగంగానే సంఘమిత్రపై నిందలు మోపారని మహిళలు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. ఈ మేరకు సమాఖ్య విచారణ పూర్తి చేశారు.

కబ్జాకోరులపై చర్యలకు వినతి

తిరుపతి కల్చరల్ : కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీలోని తమ ఇంటిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఎస్.రంగయ్య, జయలక్ష్మి విన్నవించారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ వెంకటగిరి నుంచి బతుకుదెరువు కోసం 9 ఏళ్ల క్రితం తిరుపతికి వచ్చామని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. కాలనీలోని వెంకటేష్ అనే వ్యక్తి నుంచి రూ.9లక్షలతో ఐదున్నర అంకణాల ఇలట్లు కొనుగోలు చేసుకున్నామని వెల్లడించారు. అయితే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అండతో కార్పొరేటర్ నరేంద్ర తమ ఇంటిని ఆక్రమించేందుకు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆయన అనుచరులు రోజూ మద్యం తాగి వచ్చి తమను దుర్భాషలాడుతున్నారని, ఇల్లు ఖాళీ చేయకుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని కోరారు.


మాట్లాడుతున్న బాధితుడు రంగయ్య

యోగా దినోత్సవానికి సర్వం సిద్ధం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం


మాట్లాడుతున్న స్విమ్స్ వీసీ ఆర్‌వీ కుమార్

తిరుపతి అన్నమయ్యసర్కిల్/తిరుపతి సిటీ/ చంద్రగిరి: తిరుపతి, చంద్రగిరిలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం ఈ మేరకు టీటీడీ పరిపాలన భవన పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. అలాగే ఎస్వీయూలోని తారకరామా స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్ మౌర్య పరిశీలించి, పలు సూచనలు చేశారు. పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్, జిల్లా అధికారి జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే చంద్రగిరి మండలంలోని అన్ని సచివాలయాల్లో ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు యోగా డే నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరత్నం తెలిపారు. అలాగే ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య చేతుల మీదుగా సుమారు 60మంది విద్యార్థులకు యోగాంధ్ర టీషర్టులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జీవీ రమేష్ బాబు, కంప్యూటర్‌సైన్స్ హెడ్ డాక్టర్ అంజన్‌బాబు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి తుడా : నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగించవచ్చని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. శుక్రవారం స్విమ్స్, సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్డియాలజీ ప్రొఫెసర్ వనజాక్షమ్మ, ఫిజియాలజీ ప్రొఫెసర్ శర్వాణి, నెఫ్రాలజీ ప్రొఫెసర్ శివ కుమార్, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ మాధవి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ సుధారాణి, మెడిసిన్ విభాగాధిపతి నాగరాజు, డాక్టర్ సామ్రాజ్, సంస్కృత వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ జ్యోతి పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే అరెస్ట్

- నిర్దోషిగా చెవిరెడ్డి బయటకు వస్తారు
- అంజేరమ్మకు వైఎస్సార్‌సీపీ నేతల పూజలు


అంజేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి రూరల్ : రాజకీయ కక్షతోనే చెవిరెడ్డిని అరెస్ట్ చేశారు. ఆయన ఏ తప్పు చేయకున్నా అక్రమంగా కేసులు బనాయించారు. అయితే ప్రజా నాయకుడు చెవిరెడ్డి నిర్దోషిగా బయటకు వస్తారు అని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాలకు చెందిన పలువురు నేతలు పుత్తూరు– వడమాల పేట మార్గంలోని అంజేరమ్మ ఆలయంలో చెవిరెడ్డి పేరిట అర్చన చేయించారు. ఆయనకు మనోధైర్యం, సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రభుత్వ కుట్రలను భగ్నం చేసి చెవిరెడ్డి ఏ తప్పు చేయలేదనే వాస్తవాలను లోకానికి తెలియజేయాలని అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నా యాదవ్ మాట్లాడుతూ ఉద్యమాల నుంచి వచ్చిన చెవిరెడ్డిని ఎంత తొక్కాలని చూస్తే అంత ఎత్తుకు ఎదుగుతారని కూటమి పార్టీల నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఐదేళ్లు అధికారం చేతిలో ఉన్నప్పటికీ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలకు ఏలాంటి ఇబ్బంది కలిగించకుండా ఎంతో మంచిగా చూసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, మురళీరెడ్డి, తుంటి సుధాయాదవ్, మల్లె మొగ్గల ఉమాపతి, సాంబ యాదవ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచి చేయడమే తెలుసు



ప్రజలకు మంచి చేయడం మాత్రమే చెవిరెడ్డికి తెలుసు. తప్పు చేయడం ఆయనకు రాదు. దేవుడు అంటే అపారమైన భక్తి కలిగిన వ్యక్తి. దైవసాక్షిగా చెబుతున్నా చెవిరెడ్డి అవినీతి పరుడు కాదు. చెవిరెడ్డి అక్రమ అరెస్టును అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

– ఆర్ఎస్ మస్తాన్, వైఎస్సార్‌సీపీ ప్రధానకార్యదర్శి, చంద్రగిరి మండలం

బాధాకరం



మద్యం మాటంటేనే చెవిరెడ్డికి నచ్చదు. అలాంటిది మద్యం కేసులో ఆయనను అరెస్ట్ చేయడం బాధాకరం. ఎన్నికల్లో మద్యం కావాలని ఎంత ఒత్తిడి చేసినా సరే వినిపించుకునేవారు కాదు. ఓడినా పర్వాలేదు.. మద్యం పంపిణీ చేయని తేల్చి చెప్పేవారు.

– ఎస్.మస్తాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, చంద్రగిరి

ఉద్యమమే ఊపిరి



ఉద్యమమే ఊపిరిగా నిరంతరం పోరాడిన వ్యక్తి చెవిరెడ్డి. అన్యాయం ఎక్కడ జరిగినా వెళ్లి ప్రశ్నించడమే ఆయనకు తెలుసు. ఆయనను తప్పుడు కేసుల్లో ఇరికించారు. అయినప్పటికీ చెవిరెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు.

– సిద్ధిక్‌బాషా, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి, చంద్రగిరి మండలం

భయపడేది లేదు



చెవిరెడ్డిపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. అక్రమ కేసులో జైలుకు వెళ్లినా సరే కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారు. ఆ నమ్మకం మాకు ఉంది. చెవిరెడ్డి తప్పు చేశాడు అంటే చంద్రగిరి నియోజకవర్గంలో ఎవరూ నమ్మరు.

– ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఘనంగా రెవెన్యూ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

రామచంద్రాపురం : తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ 475 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందించినట్లు వెల్లడించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. డీటీ అమృత, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్ఓలు రాజశేఖర్, శ్రీను, నరసింహులు, బాబు, గుణ భూషణ్ నాయుడు, వెంకటరమణ, ఝాన్సీ రాణి, మల్లికార్జున్ రెడ్డి, ప్రదీప్ నాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ రమాదేవి పాల్గొన్నారు.